

4

**గోదావరి జలాలతో ఖమ్మం గడ్డను**

**పచ్చని పంటల మాగాణంగా మారుస్తాం**

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

J V NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -41 శనివారం 11 జులై 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు 4 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



## జరగబోయే కురుక్షేత్రంలో

# గెలిచేది మేమే



**మధిర సభలో సిఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు**

- 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగవు: సీఎం రేవంత్
- 2029 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని సీఎం జోస్యం
- అప్పటికీ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు పెరుగుతాయని వెల్లడి
- పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 25కు పెరుగుతాయని వివరణ
- కన్నెపల్లి పంప్‌హౌస్‌లు ఆన్ చేస్తే గ్రామాలు కొట్టుకుపోతాయని వెల్లడి
- మధిర రైతు ఆశీర్వాద సభలో భరోసా నిధులు విడుదల

**ఖమ్మం,,జులై 10.(జర్నలిస్ట్ వార్త)**

ఖమ్మం జిల్లాలో జరిగిన రైతు ఆశీర్వాద సభ కాస్తా..ఎన్నికల ప్రచార సభగా మారింది. రాహుల్‌ను ప్రధానిని చయేయడమే తమ లక్ష్యమని సిఎం రేంవత్ రెడ్డి ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో 20 పార్లమెంట్ సీట్లు గెలిపించాలని, దీంతో రాహుల్‌ను ప్రధానిని చేద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. అలాగే వచ్చే ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్‌దే అధికారమని కూడా రేవంత్ ధీమా వ్యక్తం చేశారు. ఇదే సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవని చెప్పారు. అసెంబ్లీ స్థానాల సంఖ్య 119 నుంచి 182కి.. లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కి పెరుగుతాయని చెప్పారు.**మిగతాది** **2లో...**

## పండించిన ప్రతి గింజను

# కొంటున్నాం



**గతంలో రైతుబంధు కోసం తిప్పించుకున్నారు**

**రెండున్నర ఏళ్లలోనే మహిళలకు రూ. 67,000 కోట్ల రుణాలు**

**రైతు ఆశీర్వాద సభలో డిప్యూటి సిఎం భట్టి**

**ఖమ్మం,,జులై 10.(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలోని రైతులకు పెట్టుబడి సాయం అందించే క్రమంలో ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రైతు భరోసా పథకం కింద నూతనంగా రూ. 1,009 కోట్ల నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విడుదల చేయగా, ఆ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశారు. గత ప్రభుత్వం రైతు బంధు నిధుల కోసం 169 రోజులు తిప్పించుకునేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 9 రోజుల్లోనే రూ. 9 వేల కోట్లు ఇచ్చిందని**మిగతాది** **2లో...**



# రాష్ట్రానికి కాంగ్రెస్ జలద్రోహం

**హైదరాబాద్ ,జులై 10.(జర్నలిస్ట్ వార్త)**

నీళ్లు ఉండి కూడా ఎత్తిపోయకుండా, రిజర్వాయర్లు నింపకుండా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి తెలంగాకు శాపంగా, ఆంధ్రప్రదేశ్‌కు వరంగా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కన్నెపల్లి నుండి నీళు ్ళ లిఫ్ట్ చేయని చేతగానితనాన్ని అబద్ధాలతో కవర్ చేసుకోవాలని చూడటం హీనమైన చర్య గా అభిప్రాయపడ్డారు.**మిగతాది** **2లో...**

# సద్దుమణిగిన మధ్యప్రాచ్యం

**టెహ్రాన్‌కు ఖతార్ ప్రతినిధులుచర్చలకు వాషింగ్టన్ కట్టుబడి ఉంది**

**సాంకేతిక అంశాలపై భేటీ : అమెరికా**

**ఇరాన్‌తో చర్చలు జరపాలంటున్న మిడిల్ ఈస్ట్ దేశాలు**

**టెహ్రాన్ :** అమెరికా, ఇరాన్‌ల మధ్య రెండు రోజుల పాటు జరిగిన తీవ్ర దాడుల అనంతరం మధ్యప్రాచ్యంలో తుపాకుల మోత ఆగిపోయింది. దౌత్య సంబంధాలను తిరిగి గాడిలో పెట్టే ప్రయత్నంలో భాగంగా ఖతార్ ప్రతినిధులు టెహ్రాన్‌కు వెళ్లినట్టు సమాచారం. టెహ్రాన్‌తో చర్చలకు వాషింగ్టన్**మిగతాది** **2లో...**



## సోషల్ మీడియా దుర్వినియోగంపై

# ఉక్కుపాదం..

**సమాజానికి నష్టం కలిగించేలా తయారైన రోగం**

**అసత్యాలతో రాజకీయ బురదజల్లుతున్న ప్రచారం**

**ఆధునిక ఫోరెన్సిక్ టూల్స్ సమకూర్చే ఆలోచన**

**ప్రపంచ వ్యాప్తంగా కఠిన చర్యలు అమలుపై అధ్యయనం**

**కేబినేట్ నిర్ణాయాలను వివరించిన మంత్రి పార్ధసారథి**

**అమరావతి,,జులై 10.(జర్నలిస్ట్ వార్త)**

సోషల్ మీడియా వల్ల సమాజానికి ఉపయోగంతో పాటు తీవ్ర నష్టం కలిగించే 'రోగంగా' మారుతోందని ఎపి కేబినెట్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కేబినేట్ వివరాలనురాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కె. పార్ధసారథి తెలిపారు.**మిగతాది** **2లో...**



# బెంచ్‌పైకి కాగితాలు విసిరి..

## సుప్రీంకోర్టులో పిటిషనర్ వీరంగం...

**సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా పిటిషనర్ తీవ్ర గందరగోళం**

**న్యాయమూర్తులపైకి కేసు పత్రాలు విసిరికొట్టిన వ్యక్తి**

**అదుపులోకి తీసుకుని బయటకు పంపిన భద్రతా సిబ్బంది**



**,జులై 10.(జర్నలిస్ట్ వార్త)**

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో శుక్రవారం నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఒక కేసు విచారణ సందర్భంగా పిటిషనర్ హద్దులు మీరు ప్రవర్తించాడు. న్యాయమూర్తులపై దూషణలకు దిగడమే కాకుండా, కేసు **మిగతాది** **2లో...**



# తెలంగాణ జనసేనలో జోష్..

**పవన్ సమక్షంలో పార్టీలోకి భారీగా చేరికలు**

**పార్టీలో చేరిన తెలంగాణ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ రవీందర్**

**హైదరాబాద్ ,జులై 10.(జర్నలిస్ట్ వార్త)**

తెలంగాణలో పార్టీ బలోపేతం దిశగా జనసేన పార్టీ కీలక అడుగులు వేస్తోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రాజకీయ, విద్య, కార్మిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు జనసేన పార్టీలో చేరారు. పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

జనసేనలో చేరిన వారిలో తెలంగాణ యూనివర్సిటీ మాజీ వైస్-ఛాన్సలర్, ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ ప్రొఫెసర్ డి. రవీందర్ ముఖ్యులు**మిగతాది** **2లో...**

# అక్కరాజ్యం చూపిస్తా

**మహిళల కోసం ప్రత్యేక కార్యాచరణ**

**గిరిజనుల సమస్యలై ఢిల్లీ దాకా కొట్లాడుతాం**

**పాంచజన్యంతో ముందుకు వెళతామన్న కవితక్క**

**భద్రాద్రి కొత్తగూడెం,,జులై 10.(జర్నలిస్ట్ వార్త)**

ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేనను గెలిపిస్తే.. రైతును రాజును చేసి చూపిస్తానని ప్రజలకు ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం రాగానే ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో రైతుకు ప్రత్యేక కుర్చీ వేయిస్తామని తెలిపారు. త్వరలోనే మహిళల కోసం ఒక ప్రత్యేకమైన వినూత్న ఆలోచనను చేశానని చెప్పారు.**మిగతాది** **2లో...**



# తెలంగాణే మొదటి ప్రాధాన్యం..

## ఆ తర్వాతే పార్టీ : ఈటల

**కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తాన్ని తప్పుబట్టడం సరికాదు: ఈటల**

**ప్రభుత్వం వెంటనే మోటార్లు ఆన్ చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్**

**హైదరాబాద్ ,జులై 10.(జర్నలిస్ట్ వార్త)**

ప్రజల ప్రయోజనాల విషయంలో తనకు తెలంగాణే మొదటి ప్రాధాన్యమని, ఆ తర్వాతే పార్టీ, వ్యక్తిగత అంశాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తాను ఎవరో చెప్పినట్లు మాట్లాడే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన..**మిగతా****2లో...**



# జరగబోయే కురుక్షేత్రంలో గెలిచేది మేమే





(మొదటి పేజీ తరువాయి)

2029 మే-జూన్‌లో శాసనసభ ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. 182 స్థానాల్లో 117 సీట్లకు పైగా గెలుస్తామని.. ఇది భద్రాచలం రాముడిపై ఆన అని రేవంత్ వ్యాఖ్యానించారు. రైతుభరోసా తుది విడత సాయం పంపిణీ సందర్భంగా ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం జగన్నాథపురం లో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్, భాజపాపై విమర్శలు చేశారు. ఇక్కడి ప్రజలను చూస్తే నా గుండె పులకిస్తోంది. రాజకీయంగా నాకు పాలమూరు ప్రాణం. నా రాజకీయ ఎదుగుదలలో ఖమ్మం గుండెకాయగా పనిచేసింది. నేడు వరి కొనుగోలు చేసి బోనస్ ఇస్తున్నాం. రైతును రాజు చేయాలని మంత్రి తుమ్మల ప్రయత్నిస్తున్నారు. నాడు వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని అసత్యాలు చెప్పారు. ఉచిత కరెంట్.. కాంగ్రెస్ పేటెంట్ రైట్. మా ప్రభుత్వం వచ్చిన రెండున్నరేళ్లలో రైతులకు రూ.1.70లక్షల కోట్లు ఖర్చు చేశాం అని రేవంత్ అన్నారు. కల్వకుంట్ల కుటుంబాన్ని తెలంగాణ రాజకీయ ముఖచిత్రం నుంచి పాతాళానికి తొక్కే వరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు విశ్రమించరని రేవంత్‌రెడ్డి అన్నారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ మాయమాటలు, మూటలతో వస్తున్నారని కొందరు చెప్పారు. వాళ్లని ఎలా ఎదుర్కోగలరని ప్రశ్నించారు. వాళ్లు ఎలా వచ్చినా కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తోందని ఆనాడే చెప్పా. ఎన్నికల్లో మాకు 64 సీట్లు వచ్చాయి. ఉప ఎన్నికల్లో మరో 2 గెలిచాం. బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లోనూ గుండు సున్నా తప్పదని చేవెళ్ల సభలో చెప్పా. అన్ని ఎన్నికల్లోనూ నేను చెప్పినట్లుగానే ప్రజలు తీర్పు ఇచ్చారు. ఎన్నికల్లో ఓడించి పాపాల భైరవుడిని ఫాంహౌస్‌కి పరిమితం చేశాం. కౌరవ వంశాన్ని తెలంగాణ గడ్డ నుంచి తొలగిస్తాం. కాసుకో కేసీఆర్.. నిన్ను, నీ బంధువులను, సర్వేలను ఓడిస్తాం. మిమ్మల్ని ఓడించేందుకు రోజూ 18 గంటలు పనిచేస్తాం. మోదీ, అమిత్‌షా ఇతర పార్టీలను లొంగదీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్, ఆప్‌లను చీల్చారు. ఇతర పార్టీలను కూడా లొంగదీసుకుని లోక్‌సభ సీట్ల పెంపు బిల్లును ఎలా అయినా ఆమోదింపజేసుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ విషయంలో వారు విజయం సాధించడానికి అవకాశం ఉందని రేవంత్ అన్నారు. ఇకపోతే రైతు భరోసా తుది విడత నిధులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఖమ్మంలో జరిగిన రైతు ఆశీర్వాద సభలో పాల్గొన్న రేవంత్ రెడ్డి.. అన్నదాతల నిధులు విడుదల చేసేందుకు బటన్ నొక్కారు.

అనంతరం భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణలో పదేళ్లపాటు బీఆర్ఎస్ రాక్షస పాలన సాగిందని సీఎం రేవంత్ అన్నారు. వారి పాలనలో రైతులకు బేడీలు వేశారని మండిపడ్డారు. దీంతో ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ అనేది లేకుండా ప్రజలు చేశారని ఆయన చెప్పుకొచ్చారు. ఖమ్మం జిల్లాలో 2023లో ఓ అద్భుతం జరిగింది. బీఆర్ఎస్‌ను కాదని కాంగ్రెస్‌లోకి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వచ్చారు. దీంతో ఆనాడు కాంగ్రెస్‌లోకి ఉప్పెనలా జనం వచ్చారు. కారు పార్టీని ప్రజలు ఇక్కడ మళ్లీ మొలకెత్తనీయకుండా చేశారు. 2023 ప్రభుత్వ ఏర్పాటు నుంచి ఏ ఎన్నికలైనా కాంగ్రెస్‌దే గెలుపు అంటూ ధీమా వ్యక్తం చేశారు. అన్నదాతల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేశాం. ప్రతి సందర్భంలోనూ వారిని ఆదుకుంటూ వస్తున్నాం. రైతు కళ్లల్లో ఆనందమే మాకు ఆశీర్వాదం. కల్వకుంట్ల కుటుంబంలో ఒకరంటే ఒకరికి నమ్మకం లేదు. కుళ్లు, కుతంత్రాలు, కుట్రలతో బయటకు వస్తున్నారు. అధికారం పోయిందనే అక్కసుతోనే ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు. బావా బామ్మర్దులిద్దరూ ఊళ్లపై పడి తెగ తిరుగుతున్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని విషప్రచారం చేశారు. ఇప్పుడు కరెంట్ తీగలు పట్టుకోండి.. సలసల మాడిపోతారు. ఆనాడు డబుల్ బెడ్‌రూమ్‌ల పేరుతో సినిమా కథలు చెప్పారు. ఇప్పుడు పొంగులేటి 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తున్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లు ఓపెన్ చేయాలని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. కన్నెపల్లి పంప్‌లు ఆన్ చేస్తే భద్రాచల రాముడి ఆలయం సహా 44 గ్రామాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. కేసీఆర్ ఇంట్లో ఒకరంటే ఒకరికి పడదు. బీజేపీతో హరీశ్ రావు మంతనాలు జరుపుతున్నారో, లేదో భద్రాచల రాముడిపై ఒట్టేసి చెప్పాలి. కారు పార్టీలో ఉంటావో లేదో కేసీఆర్‌పై ఒట్టేసి హరీశ్ రావు చెప్పాలి. తాటిచెట్టంత పెరిగినా ఆయనకు బుర్రలో గుజ్జు లేదు. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తారని కేటీఆర్ చెల్లెలే చెబుతున్నారని తెలిపారు.

# అక్క రాజ్యం చూపిస్తా

(మొదటి పేజీ తరువాయి)

దీనిని త్వరలోనే ప్రకటిస్తానని పేర్కొన్నారు. అన్న రాజ్యం కాదు.. 'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని తెలిపారు. కొత్త పార్టీలో మార్పులు ఉంటాయని.. 'పాంచజన్యం' పేరుతో ముందుకు వెళ్తామని ఈ సందర్భంగా ఆమె చెప్పారు. ఎంత పెద్ద సమస్యకైనా మొదటి అడుగుతోనే పరిష్కారం.. తన ప్రయాణానికి మీ సహకారం కావాలని ప్రజలను కోరారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కొత్త గంగారం గ్రామం ఆదివాసి
నాయకపోడు గ్రామాల్లో సమస్యలు వారి జీవన విధానాన్ని తెలంగాణ రక్షణ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాజకీయాల కోసం రాలేదని.. ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే మీ ముందుకు వచ్చానని అన్నారు. వెనకబడిన ఆదివాసీ గిరిజనుల కోసమే 'తెలంగాణ రక్షణ సేన' పార్టీని స్థాపించానని వివరించారు. సమాజంలో ఉన్న వెనకబడిన వ్యవస్థను మార్చడానికే ఆడబిడ్డగా ధైర్యంగా తాను ముందుకు వచ్చానని పేర్కొన్నారు. మీ గ్రామానికి రావడం పుట్టింటికి వచ్చినట్లుగా ఉంది.. గ్రామ దేవతల దర్శనం కల్పించిన ప్రజలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో ఎక్కడా మార్పు రాలేదు.. నిరుద్యోగం, కరెంట్ కష్టాలు ఇంకా పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకపోడు జాతిని 'గోండు నాయకపోడు' అని పిలవడం తీవ్ర బాధాకరమని అన్నారు. 1950 రికార్డుల్లో నాయకపోడు పేరు లేకపోవడం దురదృష్టకరం.. గిరిజనుల హక్కుల కోసం ఢిల్లీ దాకా పోరాడుతామని పేర్కొన్నారు. తెలంగాణలో ఆదివాసీకి బిడ్డలు బైక్ కొందామన్నా బ్యాంకులు లోన్ ఇవ్వడం లేదని అన్నారు. బ్యాంకులు లూటీ చేసిన వారి అప్పులు మాఫీ చేసిన బీజేపీ సర్కార్.. గిరిజనులకు ఎందుకు రుణాలు ఇవ్వట్లేదు? అని ఆ పార్టీ నేతలను కవిత సూటిగా ప్రశ్నించారు. విదేశాల తరహాలో ఇక్కడి ఆదివాసీలకు రూ.2 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు బ్యాంక్ లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ పిల్లలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలి.. ఇది వారి ప్రాథమిక హక్కు అని అన్నారు. ఎస్టీలకు కేటాయించిన వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని కల్వకుంట్ల కవిత ఆరోపించారు.

# తెలంగాణ జనసేనలో జోష్..

(మొదటి పేజీ తరువాయి)

వీరితో పాటు ప్రజారాజ్యం పార్టీ మాజీ నేత, నిజామాబాద్‌కు చెందిన మీసాల శ్రీనివాస్ రావు, ట్రేడ్ యూనియన్ నేత దేవరకొండ రామ్మోహన్ రావు, హైకోర్టు న్యాయవాది మైదంశెట్టి రవివర్మ, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు బి. రవీందర్ గౌడ్ తదితరులు పార్టీలో చేరారు.వీరితో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు బత్తిని సత్యనారాయణ గౌడ్, ఆరే మహేందర్, వైద్య రంగ నిపుణులు డాక్టర్ బండారు రాజ్‌కుమార్, డాక్టర్ ఎడ్ల సాయి కృష్ణప్రియ కూడా జనసేనలో చేరారు. పవన్ కల్యాణ్ నాయకత్వం, పార్టీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు వారు ఈ సందర్భంగా వెల్లడించారు.
త్వరలో జరగనున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికలతో పాటు, 2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ జనసేన పోటీ చేస్తుందని పవన్ కల్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్ఠం చేసే వ్యూహంలో భాగంగా ఈ చేరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమంలో జనసేన ఉపాధ్యక్షుడు బి. మహేందర్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్, తెలంగాణ ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బెంచ్‌పైకి కాగితాలు విసిరి..

(మొదటి పేజీ తరువాయి)

పత్రాలను వారి వైపు విసిరికొట్టి తీవ్ర గందరగోళం సృష్టించాడు. తక్షణమే అప్రమత్తమైన భద్రతా అధికారులు అతడిని కోర్టు హాలు నుంచి బలవంతంగా బయటకు పంపించారు.అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ప్రబల్ ప్రతాప్ అనే వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం ఎదుట ఆయన స్వయంగా వాదనలు వినిపించాడు. అయితే, విచారణ ప్రారంభంలోనే పిటిషనర్ న్యాయమూర్తులను 'జ్యుడీషియల్ సర్వెంట్' అని సంబోధిస్తూ, 'లక్నో ఏసీపీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నేను మిమ్మల్ని ఆదేశిస్తున్నాను' అని వ్యాఖ్యానించాడు. దీనిపై తీవ్ర విస్మయం వ్యక్తం చేసిన జస్టిస్ విశ్వనాథన్, "మమ్మల్ని ఆదేశిస్తున్నావా?" అని ప్రశ్నించాడు.ఈ క్రమంలో ప్రబల్ ప్రతాప్ మరింత ఆవేశంతో ఊగిపోతూ, తన చేతిలోని పత్రాలను గాలిలోకి విసిరాడు. అదే సమయంలో, ఆ బెంచ్‌లో లేని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌పై కూడా దూషణలకు దిగాడు. దీంతో భద్రతా సిబ్బంది వెంటనే రంగప్రవేశం చేసి అతడిని కోర్టు హాలు నుంచి వెలుపలికి తరలించారు.ఒక సైబర్ క్రైమ్ సిండికేట్‌కు సంబంధించిన కేసులో, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 173(4) కింద తాను సమర్పించిన దరఖాస్తును ప్రైవేట్ కంప్లైంట్‌గా మార్చడాన్ని సవాల్ చేస్తూ ప్రబల్ ఈ పిటిషన్ దాఖలు చేశాడు. కోర్టు హాలులో చోటుచేసుకున్న ఈ అసాధారణ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ద

# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం..

(మొదటి పేజీ తరువాయి)

సోషల్ మీడియా ప్రభావంతో ప్రజల ఆలోచనా విధానం, పాలనా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతోందని కేబినెట్‌లో చర్చ జరిగిందని చెప్పారు. శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం వివరాలను మంత్రి పార్థసారథి విలేకర్ల సమావేశంలో వివరించారు.
విద్వేష ప్రచారం, వ్యక్తిత్వ హననం చేసే సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను గుర్తించేందుకు ఆధునిక ఫోరెన్సిక్ టూల్స్ సమకూర్చాలని ఈ కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పార్థసారథి తెలిపారు. సోషల్ మీడియా దుర్వినియోగంపై అన్ని ఎస్‌హెచ్‌ఓలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సీఎం సూచించారని పేర్కొన్నారు. సైబర్ ఇన్వెస్టిగేషన్‌లో నైపుణ్యం కలిగిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లను అవసరమైతే నియమించాలని సీఎం చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారని చెప్పారు. ప్రపంచంలోని అనేక దేశాలు సోషల్ మీడియా నియంత్రణకు కఠిన చట్టాలు అమలు చేస్తున్నాయన్న అంశంపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ప్రజెంటేషన్ ఇచ్చారని అన్నారు. సంప్రదాయ మీడియాకు ఉన్న జవాబుదారీతనం, నైతిక విలువలు సోషల్ మీడియాలో కనిపించడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం, ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం, అసత్య సమాచారం పెరుగుతోందని ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాను రాజకీయ ప్రత్యర్థులపై దాడులు, అసత్య ప్రచారం కోసం కొందరు దుర్వినియోగం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఇటువంటి కార్యకలాపాలకు కొన్ని రాజకీయ పార్టీలు కూడా ఆర్థిక సహకారం అందిస్తున్నాయని విమర్శించారు. సోషల్ మీడియా దుర్వినియోగంపై డీజీపీ, పోలీసు అధికారులు క్యాబినెట్‌కు సమగ్ర నివేదిక సమర్పించారని పేర్కొన్నారు. విదేశాల్లో అమలులో ఉన్న సోషల్ మీడియా చట్టాలు, భారత ఐటీ చట్టంలోని లోపాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించినట్లు వివరించారు. మహిళలను, బాలికలను కించపరిచే పోస్టులు, వ్యక్తిత్వ హననం, ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాన్ని ప్రభుత్వం సహించదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారని తెలిపారు.
సోషల్ మీడియా దుర్వినియోగంపై చట్టాలను మరింత బలోపేతం చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారని చెప్పారు. రాష్ట్ర స్థాయి సోషల్ మీడియా రెస్పాన్స్ సెల్ ఏర్పాటు చేయాలని ఈ భేటీలో నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. సోషల్ మీడియా దుర్వినియోగం, ఫిర్యాదుల పరిష్కారానికి రాష్ట్ర స్థాయిలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. సోషల్ మీడియా దుర్వినియోగ నియంత్రణపై దేశ, విదేశాల్లో అమలులో ఉన్న ఉత్తమ విధానాలపై గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జీఓఎం) అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు మంత్రి కొలుసు పార్థసారథి వివరించారు.

# తెలంగాణే మొదటి ప్రాధాన్యం..

(మొదటి పేజీ తరువాయి)

సాగునీటి నిర్వహణ, కాళేశ్వరం ప్రాజెక్టు, రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలతో తెలంగాణ ప్రాజెక్టుల్లోకి నీరు వస్తున్నప్పటికీ ప్రభుత్వం మోటార్లు ఆన్ చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఈటల ఆరోపించారు. వర్షాకాలంలోనూ సాగునీరు అందక రైతులు కష్టాలు పడుతున్నారని, ముఖ్యంగా ఎస్ఆర్ఎస్పీ కాల్వల కింద బోర్లు, బావులు లేకుండా వ్యవసాయం చేయడం సాధ్యం కాదని చెప్పారు.తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, ఆత్మగౌరవం కోసమే జరిగిందని ఈటల గుర్తుచేశారు. రాజకీయాలు, సిద్ధాంతాలు వేరైనా మూలాలను మరచిపోవద్దన్నారు. కాళేశ్వరం కంటే ముందే వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జలయజ్ఞం ద్వారా ప్రాణహిత జలాలను తీసుకురావాలనే ప్రణాళిక రూపొందిందని, శ్రీపాద ఎల్లంపల్లి, మిడ్ మానేరు వంటి ప్రాజెక్టులకు అప్పుడే శ్రీకారం చుట్టారని వివరించారు.స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టును అభివృద్ధి చేసి ఎల్లంపల్లికి నీటిని తరలించే వ్యవస్థ ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రస్తుతం మిడ్ మానేరు ప్రాజెక్టులో ఉన్న 29 టీఎంసీల నీరు కూడా ఆ ప్రాజెక్టుల ద్వారానే వచ్చిందన్నారు. కాళేశ్వరం వల్లే హుజూరాబాద్‌తో పాటు కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో రెండు పంటలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్లు, డిజైన్ మార్పులపై తాను మాట్లాడడం లేదని, కానీ మొత్తం ప్రాజెక్టునే తప్పుపట్టడం సరికాదని కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు. ప్రాజెక్టు పరిధిలోని దెబ్బతిన్న నిర్మాణాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, లేకపోతే రాష్ట్రం తీవ్ర కరవును ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# సద్దుమణిగిన మధ్యప్రాచ్యం

(మొదటి పేజీ తరువాయి)

కట్టుబడి ఉందని, సాంకేతిక చర్చలు కొనసాగుతున్నాయని ఓ అమెరికా అధికారి తెలిపారు. కాగా అమెరికా, ఇరాన్‌ల మధ్య దాడులు, ప్రతిదాడుల కారణంగా హోర్ముజ్ జలసంధిలో నౌకాయానం తీవ్రంగా పడిపోయింది. చరిత్రలోనే అతిపెద్ద సరఫరా అంతరాయంతో ఇప్పటికే కుదేలైన ఇంధన మార్కెట్లకు ఇది మరో దెబ్బగా మారింది. తాజా పరిణామాల నేపథ్యంలో అమెరికా తమ దాడులను నిలిపివేసినట్టు ప్రకటించింది. అయితే ఓ వైపు చాబహార్ పోర్టుపై దాడులు జరిగాక.. తాము చేయలేదని ట్రంప్ ప్రకటన చర్చనీయాంశంగా మారింది. దీంతో ఈ విషయంలో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీ ఖననానికి ఇరాన్ సిద్ధమవుతున్న తరుణంలో గురువారం ఈ దాడులు మొదలయ్యాయి. అవి దక్షిణ ఇరాన్‌లోని పలు ప్రాంతాలపై జరిగాయి.
ఈ దాడులకు ఇరాన్ నేరుగా ఎవరినీ నిందించలేదు. అయినప్పటికీ ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా చేస్తున్న ప్రచారానికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) మద్దతు ఇస్తోందని ఒక చట్టసభ సభ్యుడు హెచ్చరించారు. అయితే ఓవైపు ఖమేనీ అంత్యక్రియలు జరుగుతున్నప్పటి నుంచే ట్రంప్ వివాదాస్పద ప్రకటనలు చేశారు. ఇరాన్‌పై భీకరపోరు తప్పదని హెచ్చరికలు చేసిన విషయం విదితమే. ఆ ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే ఇరాన్‌పై మళ్లీ దాడులు జరిగాయి. దేశంలోని బుషెహర్, సిస్తాన్-బలూచిస్తాన్ ,ప్రావిన్సులు, అహ్వాజ్ , చాబహార్ నగరాలు, ఇంకా ఇతర ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పలు వైమానిక దాడులు , పేలుళు జరిగినట్టు ఇరాన్ వార్తా సంస్థలు , ప్రభుత్వ మీడియా నివేదించాయి. భారత్ నిర్వహణలో ఉన్న చాబహార్ పోర్టుపై క్షిపణుల దాడి వెనుక అమెరికా, ఇజ్రాయిల్ ఉన్నాయా? అన్న అంశం ఇంకా తేలలేదు. మరోవైపు ఈ దాడులపై సెంట్రల్ కమాండ్ కూడా స్పందించలేదు. ఏకంగా 80 స్థానాలపై అమెరికా విరుచుకుపడితే.. ఇటు ఇరాన్ కూడా తగ్గలేదు. అంతే దీటుగా స్పందించింది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై క్షిపణులతో దాడులకు దిగింది. తాము దాడులకు పాల్పడలేదని ట్రంప్ మరో సారి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. అయితే ఇరాన్‌లో ఈ దాడులు ఎవరు చేశారనే ప్రశ్న ఇంకా మిగిలే ఉంది. గురువారం జరిగిన దాడులకు ప్రతిస్పందనగా, అంతకుముందు ఇరాన్ మధ్యప్రాచ్యంలో బహ్రెయిన్, జోర్డాన్, కువైట్, ఖతార్‌లను లక్ష్యంగా చేసుకుని అనేక దాడులు చేసింది. ఇరాన్ దాడి జరిగిన వెంటనే, యూఏఈ నాయకుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్.. కువైట్ పాలకుడిని కలవడానికి ఆ దేశానికి వెళ్లారు.
గల్ఫ్ అరబ్ దేశాలు కూడా ఖతార్ విదేశాంగ మంత్రితో చర్చలు జరిపాయి. ఇరాన్‌పై జరిగిన దాడులకు ఇజ్రాయిల్ సాధారణంగా వెంటనే బాధ్యత తీసుకుంటుంది. తాజా దాడుల నేపథ్యంలో ఇజ్రాయిల్ నుంచి ఎలాంటి ప్రకటనా రాకపోవడం గమనార్హం. గురువారం రాత్రి నెతన్యాహు ట్రంప్‌తో మాట్లాడారని, గల్ఫ్‌లో అమెరికా చర్యల గురించి ట్రంప్ ఆయనకు వివరించారని ఇజ్రాయిల్ ప్రభుత్వం తెలిపింది. అవసరమైతే ఇరాన్‌ను ఎదుర్కోవడానికి తమ దేశం సిద్ధంగా ఉందని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కాట్జ్ కూడా తన హెచ్చరికను పునరుద్ఘాటించారు. ఒక సైనిక కార్యక్రమంలో కాట్జ్ మాట్లాడుతూ.. "కార్యకలాపాలను పునఃప్రారంభించడానికి, గగనతల ఆధిపత్యాన్ని తిరిగి పొందడానికి, ముప్పులను తొలగించడానికి, అవసరమైతే మూడోసారి అయినా ఇరాన్‌పై 'నీలి-తెలుపు' (ఇజ్రాయిల్) దాడిని ప్రారంభించడానికి ఇజ్రాయిల్ సైన్యం అప్రమత్తంగా , సిద్ధంగా ఉంది" అని అన్నారు. "మేము తిరిగి రావాల్సి వస్తే, మరింత పెద్ద బలంతో తిరిగి వస్తాము" అని ఆయన చెప్పారు. హోర్ముజ్ జలసంధి నౌకాయానానికి తెరిచి, స్వేచ్ఛగా ఉండాలని అరబ్ దేశాలు, అమెరికా పట్టుబ డుతున్న సమయంలో ఈ దాడులు జరిగాయి. ఆ జలసంధిపై తమకు పూర్తి నియం త్రణ ఉండాలని , నౌకలు టెహ్రాన్‌కు రుసుములు చెల్లించడం ప్రారంభించాలని ఇరాన్ అంటోంది.

# పండించిన ప్రతి గింజను కొంటున్నాం

(మొదటి పేజీ తరువాయి)

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కొనియాడారు. ఇప్పటివరకు 74 లక్షల మంది రైతులకు, 1.45 కోట్ల ఎకరాల భూములకు గానూ మొత్తం రూ. 8,759 కోట్ల పెట్టుబడి సాయాన్ని అందించామన్నారు. అలాగే మహిళా సంక్షేమానికి కట్టుబడి కేవలం రెండున్నర ఏళ్లలోనే మహిళలకు రూ. 67,000 కోట్ల రుణాలను అందించామని, పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తూ రైతును రాజుగా చూస్తున్నామని భట్టి స్పష్టం చేశారు. మరోవైపు గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులు ఒక్కటి కూడా దెబ్బతినలేదని, కానీ బీఆర్ఎస్ నాయకులు రూ. 27,000 కోట్లతో అయిపోయే ప్రాజెక్టును రూ. 1,47,000 కోట్లకు పెంచి, కట్టక కట్టక కట్టిన కాళేశ్వరాన్ని కూల్చేశారని మండిపడ్డారు. హరీష్ రావు అబద్దాలన్నీ ప్రోగేసి మాట్లాడుతున్నారని, బీఆర్ఎస్ చేసిన అప్పులు, వడ్డీలు కడుతూనే తాము ఉద్యోగుల బిల్లులు క్లియర్ చేస్తూ సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ నాయకుల భవిష్యత్తు అయిపోయిందని, వారు మళ్లీ మాయమాటలతో ఊళ్లలోకి వస్తే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరని, తరిమి తరిమి కొడతారని భట్టి విక్రమార్క హెచ్చరించారు.

# రాష్ట్రానికి కాంగ్రెస్ జలద్రోహం

(మొదటి పేజీ తరువాయి)

28 లక్షల వరద వచ్చినప్పుడే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలు చెక్కు చెదర లేదని, లక్ష క్యూసెక్కుల వరద వస్తున్న ప్రస్తుత సమయంలో ఏదో జరుగుతుందని ఎందుకు భ్రమలు కల్పిస్తున్నారు? అని ప్రశ్నించారు. కన్నెపల్లి పంపు హౌస్ నుంచి నీళ్లను లిఫ్ట్ చేసి అన్నారం, సుందిళ్ల ద్వారా ఎల్లంపల్లికి తరలించాలని చెబుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదు? అని, ప్రశ్నించారు. రోజుకు 3 టిఎంసిల నీటిని ఎత్తిపోసే సామర్థ్యం ఉన్న పంపులు సిద్ధంగా ఉన్నా కావాలనే ఆన్ చేయకపోవడం క్షమించరాని నిర్లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం నీటిని వదిలేస్తుంటే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎత్తిపోతల ద్వారా రోజుకు 3 టిఎంసిల చొప్పున ఇప్పటికే 60 టిఎంసిలకు పైగా నీటిని వినియోగించుకుందని మండిపడ్డారు. నివెంటనే కన్నెపల్లి పంపులు ఆన్ చేసి ఎల్లంపల్లి, అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్నసాగర్ రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు.

# పిట్టకథలు చెప్తే ప్రజలు పాతరేస్తారు.

## బీఆర్ఎస్ నేతపై కుల్ల యాకాంతం నిప్పులు

### కాళేశ్వరం కథలు. .. జీవన్ రెడ్డి వ్యూహాత్మక యూ-టర్న్'పై కాంగ్రెస్ అటాక్

**వర్ధన్నపేట/జూలై 10(జర్నలిస్ట్ వార్త):**
నాడు కాళేశ్వరాన్ని నిలువునా తిట్టిపోసి, నేడు అదే ప్రాజెక్టును ఆకాశానికెత్తుతున్న బీఆర్ఎస్ నేత జీవన్ రెడ్డి వైఖరిపై వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ కుల్ల యాకాంతం తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. జీవన్ రెడ్డికి బీఆర్ఎస్ గూటికి చేరినప్పటి నుంచి మతి తప్పిందా, లేక ఇదంతా నీతిమాలిన రాజకీయంలో భాగమా అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు, జలాల అంశంపై జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను పూర్తి ఆధారాలతో ఎండగట్టారు. యాకాంతం లేవనెత్తిన ప్రధానాంశాలు ఆయన మాటల్లోనేకేసీఆర్ గుర్తింపు కోసం వేల కోట్లు నాడు అన్నదెవరు? కాళేశ్వరం రీడిజైన్ వెనుక కేసీఆర్ తన సొంత గుర్తింపు కోసం ఆరాటపడ్డారని, వేల కోట్ల ప్రజాధనాన్ని అప్పనంగా దోచుకునేందుకే ఈ డ్రామాలు ఆడుతున్నారని నాడు నోరు నెత్తిన పెట్టుకుని అరిచింది ఇదే జీవన్ రెడ్డి కాదా? అని యాకాంతం ప్రశ్నించారు. నిన్నటి వరకు ఒక పనికిరాని ప్రాజెక్టుగా దాన్ని అభివర్ణించిన ఆయన, గులాబీ కండువా కప్పుకోగానే అది పరమ పవిత్రమైన



ప్రాజెక్టుగా మారిపోవడం వెనుక ఉన్న రహస్యమేంటని నిలదీశారు. ఎవరి మెప్పు కోసమో ఇలా సోయి తప్పి మాట్లాడితే ప్రజలు చూస్తూ ఊరుకోరని, రాజకీయంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా దిగజారడం ఖాయమని హెచ్చరించారు. హరీష్ రావు అంత తోప్అయితే.. కేసీఆర్ ఎందుకు పక్కన పెట్టారు? సీఎం రేవంత్ రెడ్డిని కాళేశ్వరం అంశంలో విమర్శించే స్థాయి జీవన్ రెడ్డికి లేదంటూ యాకాంతం ఘాటుగా స్పందించారు. కాళేశ్వరం విషయంలో హరీష్ రావు పెద్ద తోప్ అని సర్టిఫికెట్లు ఇస్తున్న జీవన్ రెడ్డి. హరీష్ రావు అంత సమర్థుడైతే, గత ప్రభుత్వంలో కేసీఆర్ అధికారంలో ఉండగానే ఆయన్ను ప్రాజెక్టు బాధ్యతల నుంచి ఎందుకు తప్పించారో ముందు సమాధానం చెప్పాలి అని సవాల్ విసిరారు.
సీఎం రేవంత్ రెడ్డి స్థాయికి హరీష్ రావు, కేటీఆర్ సరిపోతారని.కేసీఆర్ వెంటనే తన ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేసి, ఆ హోదాను వారిద్దరిలో ఎవరికైనా ఇప్పించాలని జీవన్ రెడ్డి కేసీఆర్‌కు సలహా ఇస్తే బాగుంటుందని ఎద్దేవా చేశారు.
పాతరేయడానికి' ప్రజలు సిద్ధంగా ఉన్నారు.
బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూడడానికి ప్రధాన కారణమే కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి అనే విషయాన్ని జీవన్ రెడ్డి ఇప్పటికైనా గుర్తుంచుకోవాలని యాకాంతం హితవు పలికారు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం, మరోవైపు ఎన్డీఎస్ఏ కాళేశ్వరం పనికిరాదని మొత్తుకుంటుంటే, ఆ నాడు నోరు మెదపని బీఆర్ఎస్ నేతలు.ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై చిల్లర ప్రకటనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారం కోల్పోయినా అహంకారం ప్రదర్శిస్తే ప్రజలు రాబోయే రోజుల్లో పాతరేయడం ఖాయమని, ఇప్పటికైనా మారకపోతే గులాబీ పార్టీ కనుమరుగు కాక తప్పదని యాకాంతం హెచ్చరించారు.

# రైతులకు 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు

## ఖమ్మం సభ ముగింపు వేడుకలను వీక్షించిన ఏఎంసీ చైర్మన్ వెంకటయ్య, పోశాల వెంకన్న



**వర్ధన్నపేట, జూలై 10(జర్నలిస్ట్ వార్త):**
ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో నిర్వహించిన 'రైతు ఆశీర్వాద సభ' ముగింపు కార్యక్రమాన్ని వర్ధన్నపేట మండల కేంద్రంలోని రైతువేదికలో మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్ ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం 9 రోజుల్లోనే రూ.9,000 కోట్ల రైతు భరోసా నిధులను అన్నదాతల ఖాతాల్లో జమ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిదేనని కొనియాడారు. సీఎం రేవంత్ రెడ్డి చివరి విడతగా రూ.1,009 కోట్ల వానాకాలం పంట పెట్టుబడి సాయాన్ని విడుదల చేయడంతో ఈ పంపిణీ ప్రక్రియ సంపూర్ణమైందన్నారు. నిధుల విడుదలతో పాటు ఈ-పట్టాదార్ పాస్‌బుక్‌ల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల నాయకుడు మరుపట్ల సాయికుమార్, కాంగ్రెస్ నాయకుడు అనిమిరెడ్డి రామచంద్రారెడ్డి, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

# వంట కోసమా.. వాస్తు కోసమా?

## పచ్చని చెట్ల నరికివేతపై అనుమానాలు



**ఏన్కూర్/, జూలై 10 (జర్నలిస్ట్ వార్త):**
మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల పాత సీఎల్ఆర్సీ భవనంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న గిరిజన విద్యార్థుల హాస్టల్ ఆవరణలో ఉన్న పచ్చని చెట్లను ఇటీవల నరికివేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఎన్నో సంవత్సరాలుగా పెరిగి విద్యార్థులకు నీడనిచ్చిన చెట్లను తొలగించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.8స్థానికుల కథనం ప్రకారం, వాస్తు కారణాలు చూపుతూ చెట్లను నరికినట్లు చెబుతున్నప్పటికీ, నరికిన కలపను వంట చెరుకుగా వినియోగించేందుకు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం కూడా వినిపిస్తోంది. దీంతో అసలు కారణం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఒకవైపు ప్రభుత్వం హరితహారం వంటి కార్యక్రమాల ద్వారా మొక్కలు నాటాలని, పచ్చదనాన్ని పరిరక్షించాలని విస్తృతంగా ప్రచారం చేస్తుండగా, ప్రభుత్వ ప్రాంగణంలోనే పచ్చని చెట్లను తొలగించడం పర్యావరణ ప్రేమికులను ఆందోళనకు గురిచేస్తోంది.చెట్లను నరికేందుకు అటవీ శాఖ లేదా సంబంధిత అధికారుల అనుమతులు తీసుకున్నారా? నిబంధనలను పాటించారా? అనే అంశాలపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఆస్తిలో ఉన్న చెట్లను తొలగించాల్సిన అవసరం ఏమొచ్చిందో స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణకు ఆదేశించి, చెట్ల నరికివేతకు గల వాస్తవ కారణాలను వెలుగులోకి తీసుకురావాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.

# కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన గుండ్రెడ్డి అఖిల్ రెడ్డి దంపతులు



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో జూలై 10 (జర్నలిస్ట్ వార్త):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను గుండ్రెడ్డి అఖిల్ రెడ్డి, ఆయన సతీమణి శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.భేటీ సందర్భంగా రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతం, కార్యకర్తల పాత్ర తదితర అంశాలపై స్వల్పంగా చర్చించినట్లు తెలిసింది. ప్రజలకు మరింత చేరువయ్యేలా పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని కేటీఆర్ సూచించినట్లు సమాచారం.అలాగే పార్టీ చేపట్టనున్న కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని గుండ్రెడ్డి అఖిల్ రెడ్డి దంపతులు తెలిపారు. వారితోపాటు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుండ్రెడ్డి రాజేశ్వర్ రెడ్డి ఉన్నారు

# అనుమతులు లేని వెంచర్లపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలి

## ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొట్టే ఏసేబు, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజారపత్నం



ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు కొట్టే ఏసేబు



డిహెచ్ పిఎస్ జిల్లా అధ్యక్షులు రాజారపు రత్నం

**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో జూలై 10 (జర్నలిస్ట్ వార్త):**
ధర్మసాగర్ మండలంలోని ఉనికిచెర్ల, రాపాకపల్లి, ధర్మసాగర్, ఎల్కుర్తి, రాంపూర్ గ్రామాల పరిధిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్ల విక్రయాలు కొనసాగిస్తున్న వారిపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొట్టే ఏసేబు, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజారపత్నం డిమాండ్ చేశారు.శుక్రవారం ధర్మసాగర్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, రైతుల నుంచి భూములను కొనుగోలు చేసిన అనంతరం సంబంధిత ప్రభుత్వ శాఖల అనుమతులు పొందకుండా కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్ల విక్రయాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపించారు. ఇలాంటి వ్యవహారాల వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లే అవకాశముందని అన్నారు.జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని సంబంధిత గ్రామాల్లో తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు నిర్వహిస్తున్నట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు కూడా ప్లాట్లు కొనుగోలు చేసే ముందు సంబంధిత వెంచర్‌కు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా లేదా అన్న విషయాన్ని పూర్తిగా పరిశీలించాలని సూచించారు.

# ప్రార్థనల మధ్య నూతన గృహ ప్రవేశం

**కల్లూరు,/ జూలై 10 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని యజ్ఞానపురం గ్రామంలో కాంచపోగు ద్వారక నూతన గృహ ప్రవేశ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రదర్ కె.వి. ఇశ్రాయిల్ సంఘ పెద్దలు, విశ్వాసులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గృహాన్ని ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం దేవుని వాక్యాన్ని అనుసరిస్తూ ప్రార్థనతో జీవించాలని సూచించారు. యువత బైబిల్ సందేశాలను అధ్యయనం చేసి వాటి విలువలను సమాజానికి తెలియజేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సంఘ పెద్దలు, మహిళలు, విశ్వాసులు, కుటుంబ సభ్యులు పాల్గొని గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.



# భూముల ధరలు భగ్గుమంటే... వివాదాలు కూడా అదే బాట!

## ధర్మసాగర్ మండలంలో పెరుగుతున్న భూ తగాదాలు.. పోలీసులకు సవాల్‌గా మారుతున్న ఫిర్యాదులు

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో జూలై 10 (జర్నలిస్ట్ వార్త):**
హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలో భూముల ధరలు వేగంగా పెరుగుతుండటంతో భూ వివాదాలు కూడా అధికమవుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దేవునూరు, రాపాకపల్లి, సాయిపేట, రాంపూర్, మల్లక్‌పల్లి, ధర్మసాగర్ గ్రామాల్లో భూముల హద్దులు, యాజమాన్య హక్కులు, వారసత్వ సమస్యలు, పాత రికార్డులకు సంబంధించిన తగాదాలు తరచూ తెరపైకి వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.
భూముల విలువలు గణనీయంగా పెరగడంతో చిన్నచిన్న హద్దు సమస్యలు కూడా పెద్ద వివాదాలుగా మారుతున్నాయని గ్రామస్థులు అంటున్నారు. స్థానికుల కథనం ప్రకారం, కొన్ని సందర్భాల్లో గ్రామస్థాయిలో రాజీ ప్రయత్నాలు జరిగినప్పటికీ ఆశించిన ఫలితాలు రావడం లేదని, కొందరు పెద్దలు డిపాజిట్ల పేరుతో పంచాయతీలు



నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలపై సంబంధిత వర్గాల స్పందన తెలియాల్సి ఉంది.
రాజీ కుదరకపోవడంతో ఇరు వర్గాలు చివరకు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయిస్తున్నాయని, దీంతో భూ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదుల సంఖ్య పెరుగుతోందని సమాచారం. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ఇలాంటి వివాదాల పరిష్కారంలోనూ స్థానిక పోలీసు అధికారులు ఎక్కువ సమయం వెచ్చించాల్సి వస్తోందని తెలుస్తోంది.భూముల కొనుగోలు సమయంలో రెవెన్యూ రికార్డులు, సర్వే వివరాలు, పట్టాదారు పాస్‌బుక్, రిజిస్ట్రేషన్ పత్రాలు, వారసత్వ హక్కులను పూర్తిగా పరిశీలించకుండా లావాదేవీలు జరపడం వల్ల తర్వాత వివాదాలు తలెత్తే అవకాశం ఉంటుందని అధికారులు సూచిస్తున్నారు. అవసరమైతే సంబంధిత రెవెన్యూ అధికారుల ద్వారా రికార్డులు ధృవీకరించుకుని, చట్టబద్ధంగా లావాదేవీలు జరపాలని సూచిస్తున్నారు.భూ వివాదాలు మరింత పెరగకుండా రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, ప్రజలు చట్టపరమైన మార్గాల్లోనే తమ సమస్యలను పరిష్కరించుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# విద్యాసంస్థల బంద్ విజయవంతం

## విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాల నిరసన




**నర్సంపేట,/ జూలై 10 (జర్నలిస్ట్ వార్త):** విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ సంఘాల పిలుపు మేరకు శుక్రవారం నర్సంపేట డివిజన్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల బంద్ నిర్వహించారు. బంద్‌కు పలు విద్యాసంస్థలు సహకరించినట్లు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు.అనంతరం నిర్వహించిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారథి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు గుర్రం అజయ్, జిల్లా సహాయ కార్యదర్శి అలువాల నరేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రతిపాదనను విరమించుకోవాలని, విద్యాశాఖకు మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించడంతో పాటు మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలని కోరారు.ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే చట్టం తీసుకురావాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఎంఈఓ, డీఈఓ, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం, విద్యార్థులకు ఉచిత రవాణా కల్పించడం, పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచడం, ర్యాగింగ్, డ్రగ్స్ నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు.విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించడంతో పాటు విద్యా రంగానికి సంబంధించిన ఎన్నికల హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సంక్షేమ పథకాలతో గ్రామాల అభివృద్ధి

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ఎర్రోళ్ల చైతన్య

**ఎల్కతుర్తి,/ జూలై 10 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి వేగం పెరిగిందని కాంగ్రెస్ యువ నాయకుడు ఎర్రోళ్ల చైతన్య అన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం కోతులనడుమ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు గృహాలు అందించడం ద్వారా వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోందని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని చెప్పారు.గ్రామానికి చెందిన ఎర్రోళ్ల హైమావతిచిరంజీవి దంపతుల నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం



ప్రభాకర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎర్రోళ్ల హైమావతి, చిరంజీవి దంపతులను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వారి కుటుంబం కొత్త ఇంటిలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.
కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు పల్లె రాకేష్ గౌడ్, తడుగుల రాజ్‌కుమార్, సరితతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు



## తెలంగాణ క్రీడా పరిజ్ఞాన అవగాహన కార్యక్రమం.



**బయ్యారం/,జులై 10.(జర్నలిస్ట్ వార్త)**తెలంగాణను క్రీడారంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మక క్రీడా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ఫిజికల్ డైరెక్టర్ లకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు బయ్యారం జడ్పీహెచ్ఎస్ పాఠశాల పిడి సునీత తెలిపారు.ఈ సందర్భంగా గ్రామాలలో క్రీడా ప్రమాణాలు,ప్రత్యేక స్పోర్ట్స్ ఆన్ వీల్స్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.తెలంగాణ క్రీడా కార్యక్రమాలు ఫిజికల్ లిటరసీ మిషన్ స్కూల్ స్థాయి నుంచే క్రీడల పట్ల అవగాహన కల్పించడానికి,ప్రతిభను గుర్తించడానికి చక్రాలపై తెలంగాణ క్రీడా పరిజ్ఞానం,నూతన క్రీడా విధానం గురించి "క్రీడా విజ్ఞాన కార్యక్రమ శ్రేణి" ద్వారా సమగ్ర అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పిఈటీ,ఫిజికల్ డైరెక్టర్స్ కి ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రతి క్రీడకు సంబంధించిన ఒక మంచి వార్మప్ మొత్తం శరీరాన్ని సిద్ధం చేయగలదని,రక్త ప్రసరణ,శరీర ఉష్ణోగ్రతను పెంచడానికి అన్ని మోటార్ లక్షణాలను మెరుగుపరచడానికి మొత్తం క్రీడా ప్రదర్శన,వ్యాయామ సామర్థ్యం విద్యార్థులకు మెరుగుపరచడానికి సహాయపడుతుందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కోచ్ లు శ్రీనివాస్ ,సైదులు తెలిపారు.కూల్ డౌన్ వార్మప్ వలె ఇది కూడా తప్పనిసరి అని మెడిసిన్ బాల్ త్రోలు,ఓవర్‌హెడ్ త్రోలు,ఫార్వర్డ్ ఫేసింగ్ త్రో తదితర ఎక్సర్ సైజ్ చెయ్యాలని పిఈటీ లకు అవగాహన కల్పించారు.ఇది క్రీడా విజ్ఞానం,ఫిజికల్ లిటరసీ మిషన్ నైపుణ్యాభివృద్ధికి దోహదం చేస్తుందని వారు తెలిపారు.

## ఏకలవ్య మోడల్ స్కూల్‌ను పరిశీలించిన ఎంపీడీవో దీపిక.



**బయ్యారం/,జులై 10. (జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలంలోని నామాలపాడు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మండల అభివృద్ధి అధికారి దీపిక శుక్రవారం సందర్శించారు.పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను సుదీర్ఘంగా తనిఖీ చేశారు. మరుగుదొడ్లు,స్టాక్ గోదాము, వంటశాల,పాత్రల శుభ్రత వంటి అంశాలను పరిక్షించి,అవసరమైన సూచనలు చేశారు.ప్రతి రోజు విద్యార్థులకు సముచితమైన, శుభ్రతతో కూడిన భోజనం అందుతోందా అనే విషయంపై నేరుగా విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. విద్యార్థులు మరింత క్రమశిక్షణతో చదువుకోవాలంటూ ప్రోత్సాహమిచ్చారు.అదేవిధంగా ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని, తరగతుల్లో బోధన పద్ధతులను, విద్యార్థుల హాజరును కూడా పరిశీలించారు.పాఠశాలలో ఉన్న కిచెన్ షెడ్,స్టాక్ రూమ్ వంటి మౌలిక వసతులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఏకలవ్య ప్రిన్సిపాల్ ధనరాజ్,ఉపాధ్యాయ బృందం,తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్లకు ఎస్ఐఆర్ నమోదుపై అవగాహన



**తల్లాడ/జూలై 10 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం జిల్లా తల్లాడ మండలం పాతపినపాక గ్రామంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నమోదు ప్రక్రియపై బీఆర్ఎస్ నాయకులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.రామారావు (కేటీఆర్) పిలుపు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సూచనల మేరకు బూత్ నంబర్లు 42, 43కు చెందిన బీఎల్ఏలు, బూత్ స్థాయి ప్రతినిధులు ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి నమోదు ప్రక్రియను వివరించారు.అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో కొనసాగేందుకు, కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణలు సకాలంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎన్యుమరేషన్ ఫారాలను పూరించడంలో సహకరించారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ ఓటు హక్కును కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో యువజన నాయకులు కాంపాటి శశికుమార్, తెల్లపుట్ట వెంకట్రావు, గోపయ్య యేసయ్య, తెల్లపుట్ట మహేష్, ఎక్కిరాల అంజి తదితరులు పాల్గొన్నారు.

## రైతు ఆశీర్వాద సభకు భారీగా తరలిన రైతులు



**తల్లాడ, జూలై 10 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రైతు ఆశీర్వాద సభకు తల్లాడ మండలం నుంచి రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని 27 గ్రామపంచాయతీల నుంచి బస్సుల్లో రైతులు సభకు బయలుదేరారు.సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ సూచనల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో యువ నాయకుడు జక్కంపూడి కిషోర్ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైరా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దున్నేటి వీరారెడ్డి, కృష్ణారెడ్డి, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

# గంజాయి, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సీఐ విశ్వేశ్వర్

### - వసంతాపూర్‌లో జాగృతి కళా బృందం అవగాహన సదస్సు







**గీసుగొండ/జులై10(జర్నలిస్ట్ వార్త):**
యువత గంజాయి, డ్రగ్స్, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గీసుగొండ సీఐ విశ్వేశ్వర్ పిలుపునిచ్చారు. వరంగల్ నగర పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఆదేశాల మేరకు, శుక్రవారం రాత్రి గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని వసంతాపూర్ గ్రామంలో జాగృతి పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా గంజాయి విక్రయించినా, వినియోగించినా వెంటనే 8712584473 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. అనంతరం జాగృతి కళా బృందం సభ్యులు విద్య, రోడ్డు భద్రత, బాల్య వివాహాల నివారణ, డయల్-100 సేవలు, సీసీటీవీల ప్రాముఖ్యతపై పాటల ద్వారా చైతన్యపరిచారు. మూఢనమ్మకాలపై మ్యాజిక్ షో, సైబర్ నేరాలు, బెట్టింగ్ యాప్‌ల నష్టాలపై నాటికను ప్రదర్శించి, 1930 సైబర్ హెల్ప్‌లైన్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అనిల్, కళా బృందం ఇన్‌చార్జి నాగమణి, సిబ్బంది విలియమ్, వెంకటేశ్వర్లు, సుమారు 250 మంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన తహసీల్దార్.



**బయ్యారం/,జులై 10.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలం ఇర్సులాపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను తహసీల్దార్ నాగరాజు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి పాఠశాలలో జరుగుతున్న విద్యాబోధన, ఉపాధ్యాయుల బోధన విధానం, విద్యార్థుల అభ్యాస స్థాయిపై వివరాలు తెలుసుకున్నారు.అనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, మెనూ అమలు, వసతి గృహ నిర్వహణను పరిశీలించారు. స్టోర్‌రూమ్,వంటశాల,డైనింగ్ హాల్, డార్మిటరీలు,మరుగుదొడ్లు,తాగునీటి సౌకర్యాలు,పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరిశుభ్రత, నిర్వహణ,విద్యార్థుల సంక్షేమంపై సంతృప్తి వ్యక్తం చేశారు.పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది సమిష్టి కృషిని అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డాక్టర్ బి.శోభన్ బాబు,ఉపాధ్యాయులు బి.హీరాసింగ్, బి. శ్రీనివాస్,డిప్యూటీ వార్డెన్ డి.ఎస్. వీరు,బి.రవి,కృష్ణవేణి, కాంతారావు,వెంకటేశ్వర్లు, అంజయ్య,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి జలాలతో ఖమ్మం గడ్డను పచ్చని పంటల మాగాణంగా మారుస్తాం


### ఆగస్టు 15 నాటికి వైరాసత్తుపల్లి వరకు నీరు.. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే నంబర్1: మంత్రి తుమ్మల





**చింతకాని,/,జులై 10.(జర్నలిస్ట్ వార్త)**
గోదావరి జలాలను ఖమ్మం జిల్లా చివరి ఆయకట్టు వరకు చేరవేసి రైతుల కలను సాకారం చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. వచ్చే ఆగస్టు 15 నాటికి వైరా, సత్తుపల్లి ప్రాంతాల వరకు గోదావరి జలాలను తీసుకెళ్లి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రైతు ఆశీర్వాద సభలో మంత్రి మాట్లాడారు. రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, తెలంగాణ వ్యవసాయ రంగం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు.

ఈ ఏడాది రాష్ట్రంలో 2.83 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి సాధించడం ద్వారా తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి వెల్లడించారు. రైతులు పండించిన ప్రతి గింజకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కల్పిస్తూ ప్రభుత్వం కొనుగోలు నిర్వహించిందని, రైతుల కష్టానికి తగిన



గౌరవం దక్కేలా చర్యలు తీసుకుంటోందన్నారు.
మొక్కజొన్న రైతులకు ప్రభుత్వం మరోసారి అండగా నిలిచిందని పేర్కొంటూ, రూ.3,722 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని ప్రకటించారు. పంటల సాగు నుంచి మార్కెటింగ్ వరకు రైతులకు భరోసా కల్పించే విధంగా ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ అమలు చేస్తోందని చెప్పారు.సాగునీటి రంగంలో ఖమ్మం జిల్లాకు స్వర్ణయుగం ప్రారంభం కానుందని మంత్రి పేర్కొన్నారు. గోదావరి జలాలు వైరా, సత్తుపల్లి ప్రాంతాలకు చేరితే వేలాది ఎకరాలకు శాశ్వత



సాగునీరు అందుతుందని, జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తి మరింత పెరిగి రైతుల ఆదాయం గణనీయంగా మెరుగుపడుతుందని వివరించారు.వ్యవసాయాన్ని లాభసాటి వృత్తిగా మార్చడమే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వ లక్ష్యమని, రైతు సంక్షేమానికి అవసరమైన ప్రతి నిర్ణయాన్ని ప్రభుత్వం ధైర్యంగా అమలు చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. రైతు అభ్యున్నతే రాష్ట్ర అభివృద్ధికి బాట వేస్తుందని, ఆ దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన అన్నారు.

## ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి.



**బయ్యారం/,జులై 10.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలంలోని కొత్తపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాల్సిన అవసరంపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సహకార అధికారి ఎం.విజయకుమారి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశాల దృష్ట్యా రైతులు పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా పప్పుధాన్యాలు, కూరగాయల పంటలు,ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి ఆదాయాన్ని పెంచుకోవాలని రైతులకు సూచించారు.కొత్తపేట గ్రామ సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ రైతులకు సమయోచితంగా అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.నీటిపారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పెద్ద చెరువులో ప్రస్తుతం ఉన్న నీటి లభ్యత పరిస్థితులను రైతులకు వివరించి అందుబాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకొని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే. రాజు,నీటిపారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు,వ్యవసాయ విస్తరణ అధికారులు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.